❖•❖•❖ 3 ❖•❖•❖

# లోక దోష భారము

*"ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44).*

మధ్య రాత్రి వేళ గెత్సేమనే తేటలో చేయబడిన ప్రార్థన యేసు తన ఇహలోక జీవితంలో ఎప్పుడైన ఎరిగియుండిన అతి గొప్ప పరీక్షలో నుండి పెల్లుబికినదని మత్తయి, మార్కు మరియు లూకా సువార్తలలో ఉపయోగింపబడిన పదములు మరియు వర్ణనలు తెలియజెప్పుచున్నవి.

ఆయన ప్రాణము "మరణమగునంతగా దుఃఖములో మునిగియున్నది" (మార్కు 14:34), మరియు "మిగుల విభ్రాంతి నొందుచు చింతా క్రాంతుడాయెను" (మార్కు 14:33). బహుగా బాధనొందిన తనువుతో, "నాయనా, తండ్రీ, నీకు సమస్తము సాధ్యము; ఈ గిన్నె నాయొద్దనుండి తొలగించుము; అయినను నా యిష్ట ప్రకారము కాదు, నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అని ఆయన ప్రార్థించాడు (మార్కు 14:36). ఆయన ప్రార్థించుటకు మొదలుపెట్టి, మోకాళ్లని దేవునికి తన మొరను వినిపించాడు. అప్పుడు, ఆయన తన ప్రార్థనలో కొనసాగుచుండగా బహుశ వ్యాకులము మరియు తీవ్రమైన దుఃఖము అను కెరటం ఆయనను తాకుతూ పోయినట్లు – ఆయన నేలమీదపడి దేవుని యెదుట సాష్టాంగపడెను. క్రొత్త నిబంధనలో ఇక్కడ మాత్రమే అగుపించుచు, భయమను రంగు పూయబడిన అభిప్రాయముతో కూడిన ఒక పదమును ఊపయోగించుచూ ఆయన మరింత "వేదన" పడెనని లూకా చెప్పుచున్నాడు.

అది "వేదనను కలిగించు భయము" లేదా, "భయంకరమైన వేదన"యై యుండవచ్చును. యేసు "మరింత ఆతురముగా" ప్రార్థించాడని కూడా లూకా చెప్పుచున్నాడు. లూకా ఉపయోగించిన ఈ క్రియావిశేషణం "బయటికి చాపుట" అను ఆలోచనను కలిగియుండినది. ఇది "విస్తృతముగా" లేక, "మరింత పట్టుదలతో" అని కూడా అనువదింపబడవచ్చును. ఈ సర్వోచ్ఛమైన అగ్ని పరీక్ష యేసుపై ఎంత కఠినమైన భారముగా మోపబడినదంటే, ఆయన చేసిన మొదటి ప్రార్థనా వ్యవధి తరువాత, ఆయనను బలపరచుటకు దేవుడు పరలోకము నుండి ఒక దూతను పంపించాడు (లూకా 22:43). ఆయన దూత చేత బలపరచబడక పోయియుండియుంటే, ఆయన శరీరముపై మోపబడి యుండిన భారము వలన అది నలిగిపోయినదై ఓటమికి ఒప్పుకొనియుండేదే.

యేసు మన కొరకు చేసిన దానిని బట్టి గొప్ప భక్తిశ్రద్ధలతోను గంభీరమైన కృతజ్ఞతాపూర్వక హృదయములతోను, "గెత్సేమనే వనము యేసుకు ఎందుకింత గొప్ప పోరాటమై యుండినది?" అని మనలను మనము ప్రశ్నించుకొందాము. తోటలో సంభవించిన సంఘటనలను సంపూర్ణముగా అవగాహన చేసుకొనుటకు మనలో గల అసమర్థతనుబట్టి దానిలో ఎక్కువ శాతము మనకొక మర్మముగానే మిగిలియుండును. ఇంకా, ఈ సన్నివేశాన్ని జాగ్రత్తతో అధ్యయనము చేయుట వలన ఆయన బలియాగమును గూర్చిన అత్యంత గూఢమైన నిత్య సత్యములు వెలుగులోనికివచ్చును.

*ఆయన మానవత్వము స్పష్టంగా గోచరమైనది.* ఇది ఖచ్చితము. యేసు మనుష్యకుమారుడును. దేవుని కుమారుడును అయి యుండెను. ఆయన శరీరధారియై జన్మించుట వలన ఆయన మనలో ఒకడాయెనని అర్థమిచ్చుచున్నది. ఆయన మన భౌతిక శారీరక గుణగణాలను మరియు పరిమితులను పూర్తిగా పంచుకొన్నాడు. మానవ జాతిలోని అత్యంత బలహీనులతోను అత్యంత బలవంతులతోను శరీరాకరంతో ఐక్యమగునంత సంపూర్ణంగా ఆయన మనతో కూడ గుర్తించుకున్నాడు. ఆయన సామాన్య జనులతో కలిసి ఎదిగాడు మనము ఈ ప్రార్థనలలో గమనించుచున్నట్లు, యేసు యొక్క మానవ శరీరము భౌతిక బాధలను మానసిక వేదనను భరించలేనంత సున్నితమైనదై యుండేను. మరుసటి తెల్లవారుజామున రానైయుండిన ఈ గడియను మరియు సిలువను ఆయన గుచ్చబడలేని, చిల్లులు పడలేని, లేదా గాయపర్చబడలేని అలౌకికమైన శరీరము గల ఒక దూత వలె ఎదుర్కొనలేదు. ఆయన ఈ శ్రమా గడియలలోనికి మానవ జాతిగుండు సకల గుణగణాలను కలిగియుండిన శరీర తత్వముతో ప్రవేశించాడు.

*ఈ పోరాటములో సమయము అనే అంశము తన పాత్రను వహించినది.* ఒక్క రోజులోనే, మన ప్రభువు తన శరీరంతోను ప్రాణంతోను లోక పాప భారమును మోయనై యుండెను. ఆయన తనను తాను పాపముల నిమిత్తము నిష్కళంకమైన బలియాగమువలె వాస్తవంగా అర్పించుకొనునను సంఘటనకు పాపము యొక్క వెచ్చని శ్వాస అదివరకు ఎన్నడూ లేని రీతిలో ఆయనను స్పృశించుచున్న అనుభవము కలుగునంత సమీపంలో ఉండెను. ఆయన తన తన చుట్టూర ఉండిన ప్రజలలోని పాపమును చూశాడు కానీ, ఇది ఆయన ఎరిగియుండిన ఎటువంటి అనుభవమునకైనను భిన్నముగా ఉండెను! ఇంతేకాకుండా, యేసు మన పాపముల నిమిత్తము మరణించుట మాత్రమే కాదు కాని, – ఏదో ఒక విధంగా అవగాహన చేసుకొనగల మన సామర్థ్యమును అధిగమించినది – వాస్తవముగా మన కొరకు

పాపమగును. "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" అని పౌలు చెప్పాడు (2 కొరింథీయులకు 5:21). అప్పటికి, కొన్ని గంటలలో, యేసు మన పాపములను బాధ్యతగా భరించి తన తండ్రి నుండి వేరుపరచబడును. ఈ శాశ్వత బల్యర్పణ యొక్క ప్రాథమిక దశ సహితము ఒక ఇహలోక సవాలును దానితో కూడా కలిగియుండెను. తన సహచరులలో ఒకడు, "ప్రభువైన యేసూ, నీవు, నా నీతియై యున్నావు కానీ, నేను నీ పాపమునై యున్నాను" అని ప్రార్థించాలని మార్టిన్ లూథర్ వానిని ప్రోత్సాహించాడు.[1] మన నిమిత్తము ఆయన పాపమగుట యేసునకు కారణమైనదేమో దాని లోతును మానవ మనస్సు త్రవ్విచూడజాలదు.

సిలువ వేయబడు సమయము సమీపించుచుండిన కొలది, ఈ పోరాటము భయంకరమును, వేదనతో కూడిన పరిమాణములకు చేరినది. యేసు తన ఇహలోక జీవితంలో, సిలువను నిరంతరము చూశాడు; కానీ ఆయన ఇప్పుడు ఈ భయంకరమైన సంఘటన యొక్క పంచలోనికి ప్రవేశిస్తున్నాడు. ఒకడు మూడు వారాల్లో శస్త్ర చికిత్స చేయించుకొనుటకు తనను తాను కట్టుబడి యుండుట ఒక ఎత్తైతే, వైద్యశాలలో చేరి ఆ శస్త్ర చికిత్స నిమిత్తమైన సిద్ధపాటులను మూడువారలకు ముందటి నుంచే మొదలు పెట్టుట పూర్తిగా మరొక ఎత్తు. యేసు మన పాపముల పరిహారార్థమై తనను తాను బలియాగముగా అర్పించుకొనుటకు ఈ రాత్రి ఒక ప్రారంభమై యుండినది. అది యేసు లోక దోషమును తనపైనే వేసుకొనివెళ్లుట గూర్చి తాను చివరిసారిగా నిర్ణయించుకొనాల్సిన సమయమై ఉండినది. ఈ కార్యము చేయాలని ఆయన అదివరకే తీర్మానించుకొన్నాడు. నిజముగా, ఆయన ఆ నిర్ణయమును పుడమిపైకి రాకమునుపే చేసుకొన్నాడు, కానీ ఈ తోటలో మరణపు గిన్నెలోని చేదును త్రాగుటకు తనను తాను పునరంకితము చేసుకొనుచుండెను. ఆయన కూడ తట్టుకొనగలిగిన శక్తి అంతటిని కూడగట్టుకొన్నాడు, గనుక అపవాది ఆయన మనస్సు మరియు ఆత్మపై దాడిచేయుచుండెను. యేసు చేయవలసి యుండిన కార్యము నిమిత్తము ఆయన అనుభవించుచుండిన అంశముల గుండా వెళ్లకుండునట్లు అడ్డుపడుటకు చేసిన వాని ప్రయత్నములలో, వాడు యేసుయొక్క శారీరక పరిమితుల వైపునకును, ఆయన ముందుండిన కార్యభారము యొక్క అపరిమితత్వము వైపునకును, దానంతటి భీబత్సము వైపునకును గురిపెట్టియుండినాడనుటలో సందేహము లేదు, యేసు ఈ పైశాచిక దాడులలో వేదనతో కూడిన, పట్టుదలతో యుండిన ప్రార్థన ద్వారా వ్యవహరించాడు. వానికి లేఖనాలను సూచించుట ద్వారా ఆయన అపవాదిని ప్రాథమికంగా అరణ్యములోనే ఓడించాడు; కానీ ఈ ఒలీవ చెట్ల క్రింద తనను తాను తన తండ్రి చిత్తమునకు పునః సమర్పణ గావించుకొనుచు, ఆయన చేసిన శక్తివంతమును కన్నీటితో నిండినవియునైన ప్రార్థనలను ఉపయోగించాడు.

*పరీక్షలోని అత్యంత భారమైన భాగము బహుశ అంధకార సంబంధమైన అపవాది శక్తులతో ఘర్షణపడుచుండిన యేసు యొక్క నీతిమంతమును, పవిత్రమైన ఆత్మ యొక్క వాస్తవికత అయియుండవచ్చును.* ఆయన ఈ శక్తులను ఇదివరకెన్నడూ లేని విధంగా ఎదుర్కొనుచుండెను. వాటిని సూటిగా ఆకాశమండలమందున్న పోరాటముగా ఎదుర్కొనుటకు ఆయన వాటిపైపు వెళ్లుచుండెను. ఇతరుల పాపము గూర్చి బహుగా దుఃఖపడిన మోషే (నిర్గమకాండము 32:32) మరియు పౌలు (రోమీయులకు 9:3) వంటివారిని మనము చూశాము; కానీ ఈ తోటలో దేవుని పరిపూర్ణుడైన కుమారుడు ఇహలోక మాలిన్యములు

మరియు పాపము వలన నాశనమైన లోకము నుండి ఆందోళన కలిగించునట్లు పుట్టుకొచ్చే దుఃఖమును మరియు బాధను భరించుచుండెను. యేసు – ఏ కోణంలో చూసినా దైవికము మరియు పవిత్రమునై యుండినవాడు, అట్లయినను మానవ శరీరము వలన పరిమితము చేయబడినవాడను నిర్బంధింపబడినవాడునై – ఆయనను చుట్టుముట్టుచుండిన పాపపు శక్తుల వైపు కదలి వెళ్లుచుండెను. ఆయన యొక్క పరిపూర్ణమైన నీతి దుష్టత్వమను కొండకును, దుర్నీతితో నిండిన పరిస్థితిలో ఉండిన పాపము యొక్క బలమునకు దగ్గరగా కదలివెళ్లుచుండెను. సంపూర్ణ ఆరోగ్యముతో ఉన్న వాడు రోగులతోను మరణావస్థలో నున్న వారునైన జనముతో క్రిక్కిరిసి నిండిపోయిన గదిలో ప్రవేశించినప్పుడు విభ్రాంతి నొందునట్లే, యేసు ఈ తోటలో ఆయన వైపు వరద వలె ఉరకలెత్తుచుండిన పాప ప్రవాహమును ఎదుర్కొన్నాడు. ఆయన యొక్క దైవిక ప్రేమ మానవ జారత్వ అంతిమ దశకు మరియు పాపము వలన శాపగ్రస్తమైన దుర్దశకును ముఖాముఖిగా తేబడినది. ఆయన యెరూషలేము గూర్చి అదివరకే ఏడ్చాడు (లూకా 19:41), కానీ దేవునికి వ్యతిరేకమైన తిరుగుబాటు యొక్క అంతిమ ఫలితము మరియు నెరవేర్పును దృష్టించుచు ఆయన తోటలో మరలా ఏడ్చాడు.

*తోటలోని పరీక్ష దాని నుండి వెలువడు పర్యవసానములను బట్టి ఒక అసాధారణమైన నిష్పతులు కలిగియుండిన పోరాటముగా కూడ అయియుండినది.* యేసు దీని బాధకరమైన అంతమును చూచుటకు తీర్మానించుకొన్నట్లయితే, లోకము ఎన్నడును అదే రీతిలో ఉండదు. అపవాది యేసు తీసుకొన్న తీర్మానము గూర్చి వాని శాయశక్తులా పోరాడాడు.

యేసు తన ప్రార్థనల ద్వారా తన తండ్రి చిత్తమునకు ఒక సంపూర్ణ సమర్పణ గావించుకొన్నాడని అవి సూచించుచున్నట్లు అగుపించుచున్నది. ఆయన “నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నె నా యొద్దనుండి తొలగిపోనిమ్ము” అని ప్రార్థించుటకు మొదలుపెట్టాడు (మత్తయి 26:39బి). ఏది ఏమైనా, ఆయన రెండవసారి చేసిన ప్రార్థన తొలగింపబడజాలని అయిష్టమైనదానిని అంగీకరించుచున్నట్లు కనబడుచున్నది (మత్తయి 26:42). ఆయన “నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నా యొద్దనుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించుగాక” అని ప్రార్థించాడు. ఆయన తన రెండవ మనవి మరియు చివరి ప్రార్థన సమయములో మరలా చెప్పుకొన్నాడు. “ఆ మాటలే చెప్పుచు మూడవమారు ప్రార్థన చేసెను” అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 26:44). అయితే మార్కు మరియు లూకా సువార్తలలో మూడవ ప్రార్థనను గూర్చి ఏమియు చెప్పబడలేదు. ఏ విధముగానైనను ఒక సత్యము తథ్యము: యేసు తన తండ్రి చిత్త ప్రకారమే కుదుటపడి కట్టుబడియుండిన మనస్సుతో ఒలీవల వనము నుండి నిర్గమించాడు. ఆయన కొరకు వేచియుండిన ముగ్గురు అపొస్తలులకు ఆయన చెప్పిన మాట గ్రీకు భాషలో ఒక సంక్షిప్తమైన ఆజ్ఞ: “లెండి, మనము వెళ్లుదము; ఇదిగో, నన్ను అప్పగించువాడు సమీపించియున్నాడు!” ఆయన అపవాది చేయగలిగిన దానంతటిపై విజయం సాధించాడు. ఆయన తన తండ్రిలో కలిగియుండిన విశ్వాసము మరియు ఆయనకే సంపూర్ణంగా విధేయుడై యుండుటకు నిర్ణయించుకొన్న నిశ్చలమైన తీర్మానమునుబట్టి, తీర్పు తీర్చబడుటకును, సిలువవేయబడుటకును, జనసమూహము చేత తీసుకొనిపోబడుటకును ఆయన ఇప్పుడు సిద్ధంగా ఉన్నాడు.

పట్టువిడువని ప్రార్థన యొక్క అత్యావశ్యకత ఈ తోటలో నుండిన మన రక్షకుని నుండి మనము నేర్చుకొను ఒక ముఖ్యమైన (గుణ) పాఠమై యున్నది. “మీరు శోధనలో

ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి” అని ఆయన తన అపొస్తలులతో చెప్పాడు (మత్తయి 26:41ఎ). కాని యేసు ప్రార్థిస్తూవుంటే వారు నిద్రపోయారు. ఫలితంగా, తరువాత కొన్ని గంటలలోనే, యేసు ఆయన గూర్చి తీర్చబడుచుండిన తీర్పులలో ప్రవేశించి విజయిభవుడై ముందుకు సాగుచుండగా, అపొస్తలులు శోధనలో ప్రవేశించి విఫలులయ్యారు.

❖◆❖◆❖

*యేసు గెత్సేమనే తోటలోని అంధకారములో దుఃఖము చేత ఎందుకు ఇంతగా నలుగగొట్టబడిన అనుభూతి చెందాడు? అది బాధ మరియు మరణమును గూర్చిన భయము కంటే ఎక్కువైనదేదీ కానిదైయుండెనా? అది దానిని మించినదై యుండును. అది ఆయనకు ఎదురుగా వచ్చుచు ఆయనను ముంచెత్తుచుండిన పాపము మరియు అపరాధముతో కూడిన మేఘము, మన సమస్త పాపమును ఆయన ఆత్మతోను శరీరముతోను వహించుటయై యుండినది. తన తండ్రినుండి వేరుపరచబడతానేమోనను భయభీతిని గొలుపు గ్రహింపై యుండినది. అది దాని సంపూర్తి అవగాహన లేదా అర్థముతో – జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న దేవుని గొఱ్ఱెపిల్లయగుటయై యుండినది.*

---

సూచన

[1]Martin Luther, letter to George Spalatin, 8 April 1516, Wittenberg, Germany. Luther (1483-1546) was a German theologian and leader of the Protestant Reformation.